Follow: @ANNTELUGU
ANN తెలుగు
REGISTERED NUMBER: APTEL/2014/58382
02-10-2025
# మహా పత్రిక
తిరుపతి, హైదరాబాద్
సంపుటి- 22 సంచిక- 298 పేజీలు-04 వెల-రూ.6
PUBLISHED FROM TIRUPATI | HYDERABAD
గురువారం
WWW.EPAPER.MAHAADAILY.COM


మహా పత్రిక పాఠకులు మరియు ప్రకటనకర్తలకు విజయదశమి పండుగ శుభాకాంక్షలు.. గురువారం ఆఫీస్‌కు సెలవుదినం కావున శుక్రవారం పత్రిక వెలువడదు. పునదర్శనం శనివారం



## జడ్పీ పీఠాలపై హేమాహేమీల గురి

### బలమైన నేతల కోసం పార్టీల అన్వేషణ

**హైదరాబాద్, మహా:**

స్థానిక రిజర్వేషన్లు ఖరారవడంతో జడ్పీపీఠాలపై కీలక నేతలు గురిపెట్టినట్లు కనబడుతోంది. పార్టీల హైకమాండ్ లు.. ఏ జిల్లాలో ఎవరున్నారు? జిల్లా పరిషత్ పీఠానికి ఎవరు సమర్థులు అని అన్వేషణ ప్రారంభించాయి. రిజర్వేషన్లన్నీ కంప్యూటర్ లో ఆటోమేటిక్ గా జరిగినయ్.. మా కొడంగల్ లో కూడా సరిగా రాలేదని అంటున్నరు. కానీ ఏం చేయలేం. వచ్చిన రిజర్వేషన్ల ప్రకారం ఫాలో కావాల్సిందే అని సీఎం రేవంత్ స్పష్టం చేశారు.

మిగతా 2లో

**టాప్ న్యూస్**



### మా పార్టీలో స్వేచ్ఛ ఎక్కువ
- మేం ప్రజల కోసం మాట్లాడుతాం
- మీరు కమిషన్ల కోసం నోరు మూసుకుంటారు
- కేటీఆర్ పై జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ఫైర్

02



దేశంలో అత్యంత సంపన్న మహిళగా
### రోష్ని నాడార్
- హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ ఛైర్‌పర్సన్ రోష్ని
- రూ. 2.84 లక్షల కోట్లుగా ఆస్తి విలువ అంచనా

02



### నువ్వసలు బీసీ బిడ్డవేనా?
- సర్పంచ్ ఎలక్షన్స్ ఆపిస్తవా?
- ఎంపీ ఈటల రాజేందర్‌పై ఎమ్మెల్సీ కవిత ఫైర్
- బీఆర్ఎస్ పార్టీతో నాకు ఎలాంటి సంబంధం లేదు

03


SRI GOLD
TRUSTED GOLD BUYERS


బంగారం ధరలు

| | |
|---|---|
| 24 క్యారెట్ | 1,19,240 |
| 22 క్యారెట్ | 1,09,300 |
| సిల్వర్ (కేజీ) | 1,51,000 |



02

### సీఎం రేవంత్‌ను కలిసిన ఖానాపూర్ ఎమ్మెల్యే
వెడ్మ బొజ్జు వినతితో నిధులు మంజూరు
7న జోడేఘాట్ రావాలని ఆహ్వానం



## దసరా తర్వాత బీసీ సభ

### కాంగ్రెస్ మాస్టర్ ప్లాన్
### ఆపరేషన్ లోకల్ పై ఫోకస్
- సీఎంతో పీసీసీ చీఫ్ మహేష్, మంత్రి పొన్నం కీలక భేటీ
- అక్టోబర్ 8లోగా.. బీసీ సభ నిర్వహించే యోచన
- జూబ్లిహిల్స్ బైపోల్ అభ్యర్థి ఎంపికపై సీఎం సమీక్ష

బీసీల ఛాంపియన్ గా నిలవాలనే లక్ష్యంతో కాంగ్రెస్ తగ్గేదెలే అంటోంది. 42శాతం రిజర్వేషన్లపై జీవో ఇవ్వడంతో పాటు రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఎన్నికలకు సిద్ధంగా ఉన్నామని తెలపడంతో షెడ్యూల్ రిలీజ్ అయింది. ఇపుడు లోకల్ వార్ తో పాటు జూబ్లిహిల్స్ బైపోల్ లో గెలిచేందుకు సీఎం రేవంత్ పక్కా ప్రణాళికలు అమలుచేస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు, జూబ్లీహిల్స్ బై పోల్‌లో గెలుపే లక్ష్యంగా పార్టీ ముమ్మర కసరత్తు చేస్తోంది. ఈ రెండు ఎన్నికల్లో అభ్యర్థుల ఖరారుపై కాంగ్రెస్ దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ , మంత్రి పొన్నం ప్రభాకర్ భేటీ అయ్యారు.

- మహా, హైదరాబాద్

02



## మాదంతా ఖాకీ బుక్

### మాకు పింక్ బుక్ గురించి తెలియదు
- వ్యక్తిత్వ హననానికి పాల్పడితే చర్యలు తప్పవు
- మావోయిస్టులు జనజీవన ప్రవంతిలో కలవాలి
- పోలీసుశాఖలో 17 వేల ఖాళీ పోస్టుల భర్తీకి చర్యలు
- శాంతియుతంగా స్థానిక ఎన్నికలు నిర్వహిస్తాం
- నూతన డిజిపిగా బాధ్యతలు స్వీకరించిన శివధర్ రెడ్డి

**హైదరాబాద్, మహా :** 'మాకు ఉన్నదంతా ఖాకీ బుక్.. మాకు పింక్ బుక్ గురించి తెలియదు. ఇతరుల వ్యక్తిత్వ హననానికి పాల్పడేలా సోషల్ మీడియాలో పోస్టులు పెడితే చర్యలు తీసుకుంటాం' అంటూ నూతన డీజీపీ శివధర్ రెడ్డి హెచ్చరించారు.

మిగతా 2లో

### సీఎం అభ్యర్థిగా తేజస్వి బెస్ట్
- ప్రశాంత్ కిశోర్ కు పెరుగుతున్న ఆదరణ
- నితీష్ ఇక ఇంటికే అంటున్న సర్వేలు

02









# దసరా తర్వాత బీసీ సభ

**హైదరాబాద్, మహా:** బీసీల ఛాంపియన్ గా ని లవాలనే లక్ష్యంతో కాంగ్రెస్ తగ్గేదెలే అంటోంది. 42శాతం రిజర్వేషన్లపై జీవో ఇవ్వడంతో పాటు రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఎన్నికలకు సిద్ధంగా ఉన్నామని తెలపడంతో షెడ్యూల్ రిలీజ్ అయింది. ఇపుడు లోకల్ వార్ తో పాటు జూబ్లి హిల్స్ బైపోల్ లో గెలిచేందుకు సీఎం రేవంత్ పక్కా ప్రణాళికలు అమలుచేస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు, జూబ్లీహిల్స్ బై పోల్‌లో గెలుపే లక్ష్యంగా పార్టీ ముమ్మర కసరత్తు చేస్తోంది. ఈ రెండు ఎన్నికల్లో అభ్యర్థుల ఖరారుపై కాంగ్రెస్ దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ , మంత్రి పొన్నం ప్రభాకర్ భేటీ అయ్యారు. బుధవారం ఉదయం జూబ్లీహిల్స్ లోని సీఎం నివాసంలో జరిగిన సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికలు, జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక, బీసీ రిజర్వేషన్ల అంశంలో కోర్టు కేసు వంటి కీలక అంశాలపై చర్చించినట్లు సమాచారం. జడ్పీటీసీ స్థానాలకు అభ్యర్థుల పేర్ల జాబితాను అక్టోబర్ 5వ తేదీ నాటికి పీసీసీకి పంపించాలని మంత్రులు, డీసీసీ అధ్యక్షులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. బుధవారం జరిగిన భేటీలో బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు కేసు, తాజా పరిస్థితులపై అనుసరించాల్సిన వ్యూహాలపై సీఎం దిశా నిర్దేశం చేసినట్లు సమాచారం.

**బీసీ గర్జన సభ**

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిసారి జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికలు కావడంతో ఈ ఎన్నికల్లో పై చేయి సాధించేందుకు హస్తం పార్టీ ప్రణాళికలు రచిస్తోంది. ఇందులో భాగంగా దసరా తర్వాత బీసీ గర్జన నిర్వహణకు ప్లాన్ చేస్తోంది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన దృష్ట్యా బీసీ సంఘాల నేతలతో పీసీసీ చీఫ్ సమావేశం కాబోతున్నారు. బీసీల పట్ల కాంగ్రెస్ కమిట్ మెంట్‌ను వారికి వివరించే అవకాశాలు కనిపిస్తున్నాయి. అక్టోబర్ 8వ తేదీన రిజర్వేషన్లపై హైకోర్టు నిర్ణయం నేపథ్యంలో ప్రభుత్వానికి బీసీ సంఘాల మద్దతు కూడగట్టుకునేలా బీసీ సంఘాలను మోటివేట్ చేయాలని డిసైడ్ అయ్యారు. బీసీ సభ ద్వారా బీసీల అంశంలో కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధిని మరోసారి గట్టిగా చాటాలని రాష్ట్రప్రభుత్వం భావిస్తోంది.

**జూబ్లీహిల్స్ అభ్యర్థులపై సీఎం సమీక్ష**

జూబ్లీహిల్స్ ఉపఎన్నికకు కాంగ్రెస్ అభ్యర్థి ఎంపికపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్షించారు. దీనిపై నివేదిక ఇవ్వాలని ముగ్గురు మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు, వివేక్ లకు సూచించారు. . తాజా రాజకీయ పరిస్థితులను వివరిస్తూ.. నివేదికలో అభ్యర్థుల పేర్లు, వివరాలు ఉండాలని పేర్కొన్నారు. గెలుపు గుర్రాన్ని జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో నిలబెట్టాలన్న కోణంలోనే నివేదిక ఉండాలని సీఎం పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికశాతం స్థానాలను కైవసం చేసుకోవాలని స్పష్టం చేశారు. ఈ అంశంలో ఇన్‌ఛార్జ్ మంత్రులతోపాటు ఎంపీల భాగస్వామ్యంతో వెళ్లాలని సూచించారు. సీఎం రేవంత్‌రెడ్డితో పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ కూడా సమావేశమై ఈ అంశంపై చర్చించారు. ప్రస్తుతం అంజన్ కుమార్ యాదవ్, నవీన్ యాదవ్, బొంతు రామ్మోహన్, మురళీగౌడ్, సీఎన్ రెడ్డి, రంజిత్ రెడ్డి పేర్లు పరిశీలనలో ఉన్నాయి.

# మాదంతా ఖాకీ బుక్

(మొదటిపేజీ తరువాయి)

పోలీస్ శాఖలో 17,000 ఖాళీలు ఉన్నాయని.. ఆ నియామకాలు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. బేసిక్ పోలీసింగ్‌తో సాంకేతికను ఉపయోగించుకుని మరింత సమర్థవంతంగా పని చేస్తామని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర నూతన డీజీపీగా శివధర్ రెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. పండితుల వేద మంత్రాల నడుమ డీజీపీగా శివధర్ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. డీజీపీగా నియమించినందుకు తెలంగాణ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేశారు. ఏ లక్ష్యంతో తనను నియమించారో అందుకు అనుగుణంగా పనిచేస్తామని స్పష్టం చేశారు. తన మొదటి ఛాలెంజ్ లోకల్ బాడీ ఎన్నికలని తెలిపారు. శాంతియుతంగా ఎన్నికలు పూర్తి చేయడానికి సన్నద్ధం అవుతున్నామని చెప్పారు.

**మావోయిస్టులతో చర్చలు అనవసరం**

మావోయిస్టు పొలిట్ బ్యూరో మల్లోజుల వేణు గోపాల్ ఇటీవల ఒక ప్రకటన రిలీజ్ చేశారని.. బయటకు రావడానికి, ఆయుధాలు వదిలి పెట్టడానికి నిర్ణయం తీసుకున్నామంటూ ప్రకటన విడుదల చేశారన్నారు. జనరల్ సెక్రటరీ బసవరాజు ఉన్నపుడే ఆ నిర్ణయం జరిగిందని వేణుగోపాల్ ప్రకటనలో పేర్కొన్నారని గుర్తు చేశారు. వేణుగోపాల్ ఇచిన స్టేట్‌మెంట్‌ను జగన్ ఖండించారని.. ప్రజా పోరాట పంథా సక్సెస్ కావడం లేదని మావోయిస్టులే అంటున్నారని డీజీపీ వెల్లడించారు. పోలీసులు వేధిస్తారని భయం లేకుండా ఎలాంటి సంశయం లేకుండా మావోయిస్టుల జన జీవన స్రవంతిలోకి రావాలని విజ్ఞప్తి చేశారు. చాలా మంది ఇప్పటికే పార్టీ నుంచి బయటకు వస్తున్నారని.. రీసెంట్ సెంట్రల్ కమిటీ మెంబర్ కవితక్క కూడా లొంగిపోయారన్నారు. మావోయిస్టులతో తమకు ఇక్కడ సమస్య లేనప్పుడు వాళ్ళతో చర్చలు అనవసరమని చెప్పారు. సైబర్ సెక్యూరిటీ, ఈగల్ టీంలకు పూర్తి సహకారం ఉంటుందన్నారు. బేసిక్ పోలీసింగ్, విజువల్ పోలీసింగ్ మానిటరింగ్ సిస్టమ్ ఇంప్రూవ్ చేస్తామన్నారు. ‘మాకు ఉన్నదంతా ఖాకీ బుక్.. మాకు పింక్ బుక్ గురించి తెలియదు. ఇతరుల వ్యక్తిత్వహనానికి పాల్పడేలా సోషల్ మీడియాలో పోస్టులు పెడితే చర్యలు తీసుకుంటాం’ అంటూ డీజీపీ హెచ్చరించారు.

**వామపక్ష తీవ్రవాదం అణచివేయడంలో**

1994 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన శివధర్ రెడ్డి, తొలుత ఆంధ్రప్రదేశ్ క్యాడర్‌లో పనిచేశారు. 2014లో రాష్ట్ర విభజన జరిగిన తర్వాత ఆయన తెలంగాణ క్యాడర్‌కు మారారు. ఐపీఎస్ అధికారిగా శిక్షణ పూర్తి చేసుకున్న అనంతరం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పలు కీలక బాధ్యతలు నిర్వర్తించారు. 1996నుంచి 2000 మధ్యకాలంలో విశాఖపట్నం జిల్లాలోని అనకాపల్లి, నర్సీపట్నం, చింతపల్లి సబ్ డివిజన్లలో ఏఎస్పీగా సేవలందించారు. ఆ తర్వాత, గ్రేహౌండ్స్‌లో అడిషనల్ ఎస్పీగా పనిచేశారు. ఆదిలాబాద్ జిల్లా బెల్లంపల్లిలో కూడా ఆయన విధులు నిర్వహించారు. ముఖ్యంగా ఉగ్రవాద కదలికలను గుర్తించడంలో, వామపక్ష తీవ్రవాదాన్ని అణచివేయడంలో శివధర్ రెడ్డి కీలక పాత్ర పోషించి మంచి గుర్తింపు పొందారు.

# మా పార్టీలో స్వేచ్ఛ ఎక్కువ

## మేం ప్రజల కోసం మాట్లాడుతాం

## మీరు కమిషన్ల కోసం నోరు మూసుకుంటారు

## కేటీఆర్ పై జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ఫైర్

**జడ్చర్ల, మహా :** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రతిదీ రాజకీయం చేయొద్దని కాంగ్రెస్ పార్టీకి చెందిన జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ఫైర్ అయ్యారు. మీ పార్టీలో ఒక్క ఎమ్మెల్యే.. ఏ రోజైనా తనకు సంబంధించిన ఇష్యూ పైన మాట్లాడారా? అని ఆయన కేటీఆర్ ను సూటిగా ప్రశ్నించారు. ప్రజలకు కావాల్సిన అంశంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఏరోజైనా స్వేచ్ఛగా మాట్లాడారా? అని ఆయన నిలదీశారు. మా కాంగ్రెస్ పార్టీలో, మా ప్రభుత్వంలో స్వేచ్ఛ ఎక్కువ అని చెప్పిన అనిరుధ్ రెడ్డి.. 'మా ప్రభుత్వానికి ప్రజలపై చిత్తశుద్ధి ఉంది. మీ పాలన.. నిరంకుశత్వ పాలన. మీది రౌడీయిజం పాలన. అది చూడలేకనే ప్రజలు మిమ్మల్ని.. మీ పార్టీని బొంద పెట్టారు. నేను పోరాటం చేసేది రైతుల కోసం, నా జడ్చర్ల నియోజకవర్గం ప్రజల కోసం. మీ ఎమ్మెల్యేలు రౌడీయిజం చేసేది ఫ్యాక్టరీల్లో వసూళ్ల కోసం, కమీషన్లు, భూకబ్జాల కోసం అని మీరు గమనించాలి' అని ఎమ్మెల్యే చెప్పుకొచ్చారు.



తాను చెరువుల్లో చేపలు చనిపోతున్నాయని ముదిరాజుల కోసం ఫైట్ చేస్తున్నానని.. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు ఫ్యాక్టరీల్లో పొల్యూషన్ వచ్చినా వాళ్లకు కమీషన్ వస్తే చాలని, ఎప్పుడు కూడా ఈ సమస్య పై మాట్లాడలేదని మీరు గుర్తించాలని అనిరుధ్ రెడ్డి.. కేటీఆర్ ఉద్దేశిస్తూ వ్యాఖ్యానించారు.



# జడ్పీ పీఠాలపై హేమాహేమీల గురి

## బలమైన నేతల కోసం పార్టీల అన్వేషణ

(మొదటిపేజీ తరువాయి)

ఈ నేపథ్యంలో పోటీచేసే స్థానాలపై కీలక నేతలు గురిపెట్టగా, హైకమాండ్.. బలమైన నేతలను గుర్తిస్తూ మీరు తప్పనిసరిగా పోటీచేయాలన్న సంకేతాలు కూడా ఇస్తోంది. అక్టోబర్ 8న పూర్తిస్థాయి స్పష్టత వస్తుందని భావిస్తున్నా, ప్రస్తుత రిజర్వేషన్లను పరిగణనలోకి తీసుకునే జిల్లా పీఠాలపై అటు క్యాడర్, ఇటు హైకమాండ్ లెక్కలు వేస్తోంది. కామారెడ్డి జడ్పీచైర్మన్ పదవి జనరల్ కాగా కాంగ్రెస్ నుంచి బాన్సువాడ ఎమ్మెల్యే, మాజీ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి కుమారుడు పోచారం భాస్కర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి ప్రధాన పోటీదారులుగా ఉన్నట్లు కనబడుతోంది. మహబూబాబాద్ జడ్పీచైర్మన్ జనరల్ కావడంతో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి తనయుడు భార్గవ్ రెడ్డి పోటీచేసే అవకాశముందన్న ప్రచారం జరుగుతోంది. ఇలా అనేక జడ్పీపీఠాలపై జిల్లాస్థాయిలో, రాష్ట్రస్థాయిలో చర్చోపచర్చలు జరుగుతున్నాయి.

**సంగారెడ్డి బరిలో మంత్రి దామోదర కూతురు**

సంగారెడ్డి జెడ్పీ స్థానం ఎస్సీ జనరల్‌కు రిజర్వ్అయింది. ఈ స్థానం కోసం మంత్రి దామోదర రాజనర్సింహ.. తన కూతురు త్రిషను బరిలోకి దింపే ప్రయత్నం చేస్తున్నట్టు సమాచారం. ఆమె ఆందోలు నియోజకవర్గంలోని చౌటకూరు నుంచి జెడ్పీటీసీగా పోటీ చేసే అవకాశం ఉందని పార్టీ నాయకులు చెబుతున్నారు. ఆందోలు మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ తమ్ముడు రాహుల్ సైతం పోటీలో ఉండే అవకాశాలున్నాయి. ఆయన మునిపల్లి, లేదా చౌటకూరులో.. త్రిషపై పోటీ చేయొచ్చని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతుంది.

**మెదక్ నుండి పద్మా దేవేందర్ రెడ్డి**

మెదక్ జిల్లా పరిషత్ జనరల్ కు రిజర్వ్ కావడంతో నర్సాపూర్ మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి చైర్మన్ పదవి ఆశిస్తున్నారు. గతంలో తనకు తగిన గుర్తింపు ఇస్తామని రేవంత్‌రెడ్డి హామీనిచ్చారని చెబుతున్నారు. ఇదే స్థానం కోసం మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి సైతం బీఆర్ఎస్ నుంచి బరిలో ఉంటబోతున్నారనే చర్చ ఉంది.

**ఆదిలాబాద్ నుండి కంది మౌన శ్రీనివాసరెడ్డి**

ఆదిలాబాద్ జిల్లా పరిషత్ జనరల్ మహిళలకు రిజర్వ్ కావడంతో ఈ స్థానం నుండి ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్ ఛార్జి కంది శ్రీనివాసరెడ్డి సతీమణి కంది మౌన శ్రీనివాసరెడ్డి బరిలో నిలిచే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ముఖ్యమంత్రి, పీసీసీ చీఫ్ ఆదేశిస్తే కంది ఫ్యామిలీ పోటీకి సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. సామాజిక సేవా కార్యక్రమాల్లో, పార్టీ కార్యక్రమాల్లో మౌన శ్రీనివాసరెడ్డి అత్యంత చురుకుగా పాల్గొంటారు. పలు గ్రామాల క్యాడర్ నుండి ఇప్పటికే దీనికి సంబంధించి పార్టీకి వినతులు కూడా అందాయి. ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో స్వల్పతేడాతో ఓడిన కంది శ్రీనివాసరెడ్డి గత రెండేళ్ళుగా పార్టీని బలమైనశక్తిగా తీర్చిదిద్దారు. లోక్ సభ, ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ ఇక్కడ నెంబర్ వన్ గా నిలిచింది. నిర్మల్, ఆసిఫాబాద్ బీసీ జనరల్ కు రిజర్వ్ అయ్యాయి.

**ఖమ్మం నుండి విజయాబాయి**

ఖమ్మం జెడ్పీ చైర్మన్ స్థానం ఎస్టీ జనరల్ కావడంతో అనేక పేర్లు ప్రచారంలోకి వచ్చాయి. ఇందులో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అనుచరులుగా ఉన్న విజయబాయి పేరు ప్రముఖంగా వినిపిస్తున్నది. గతంలో అసెంబ్లీ ఎన్నికల్లో వైరా నియోజకవర్గం నుంచి ఆమె కాంగ్రెస్ టికెట్ కోసం ప్రయత్నాలు చేశారు. చివరి నిమిషంలో విజయబాయికి టిక్కెట్టు దక్కలేదు. భవిష్యత్‌లో న్యాయం చేస్తామంటూ పార్టీ, పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ ఇవ్వడంతో ఆమె వెనక్కి తగ్గారు. ప్రస్తుతం ఖమ్మం జెడ్పీ చైర్మన్ ఎస్టీ జనరల్ కావడంతో ఆమె పేరు ప్రధానంగా వినిపిస్తోంది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావుల మద్దతుదారులు కూడా ఈ సీటును ఆశిస్తున్నారు.

# సీఎం అభ్యర్థిగా తేజస్వి బెస్ట్

## ప్రశాంత్ కిశోర్ కు పెరుగుతున్న ఆదరణ

## నితీష్ ఇక ఇంటికే అంటున్న సర్వేలు



**మహా:** బీహార్‌లో అసెంబ్లీ ఎన్నికలల్లో గెలుపే లక్ష్యంగా వ్యూహ ప్రతివ్యూహాల్లో మునిగి తేలుతున్నాయి. బీజేపీ నాయకత్వంలోని ఎన్డీఏ, కాంగ్రెస్ నేతృత్వంలోని మహాఘఠ్‌బంధన్ మధ్య ప్రధాన పోరు ఉంటుందని సర్వేలు వెల్లడిస్తున్నాయి. ప్రశాంత్ కిశోర్ కొత్త పార్టీ జన సురాజ్ ప్రభావం పెద్దగా ఉండకపోవచ్చని సర్వే ఫలితాలు చెబుతున్నాయి. సీఎం అభ్యర్థిగా ఆర్జేడీ యువనేత తేజస్వీ యాదవ్ అగ్రస్థానంలో ఉన్నట్టు సీ ఓటర్ సర్వే వెల్లడించింది. ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ ఆశ్చర్యకరంగా మూడో స్థానానికి పరిమితం కాగా, ప్రశాంత్ కిశోర్ రెండో స్థానంలో నిలిచారు. ఫిబ్రవరి నుంచి సెప్టెంబర్ వరకు సేకరించిన డేటా ఆధారంగా సర్వే ఫలితాలను సీ ఓటర్ ప్రకటించింది. సెప్టెంబర్ ఫలితాలను తీసుకుంటే.. 35.5 శాతం మంది తేజస్వి యాదవ్‌ను ముఖ్యమంత్రి అభ్యర్థిగా కోరుకున్నారు. ప్రశాంత్ కిశోర్ కావాలని 23.1 శాతం మంది ఆకాంక్షించారు. నితీశ్ కుమార్‌ను కేవలం 16 శాతం మంది మాత్రమే కోరుకున్నారు. ఎల్జేపీ నేత చిరాగ్ పాశ్వాన్‌కు 9.5, బీజేపీ నాయకుడు సామ్రాట్ చౌదరి 6.8 శాతం మంది మద్దతు ప్రకటించారు. అయితే ఫిబ్రవరి నుంచి చూసుకుంటే తేజస్వి, నితీశ్ కుమార్‌లకు మద్దతు తగ్గుతూ వస్తోంది. ఫిబ్రవరిలో తేజస్వికి 40.6 శాతం మంది, నితీశ్‌కు 18.4 శాతం మంది మద్దతు దక్కింది. మరోవైపు సీఎం అభ్యర్థిగా ప్రశాంత్ కిశోర్‌కు ఆదరణ పెరుగుతోంది. ఫిబ్రవరిలో ఆయనకు మద్దతు ఇచ్చిన వారు 14.9 శాతం మాత్రమే. 8 నెలల్లో ఆయనకు ఆదరణ 8.2 శాతం వరకు పెరిగినట్టు సీ ఓటర్ డేటా వెల్లడించింది. కాగా, మహాఘఠ్‌బంధన్ సీఎం అభ్యర్థి తానేనని తేజస్వీ యాదవ్ ఇప్పటికే ప్రకటించుకున్నారు. దీనిపై కాంగ్రెస్ ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు.

**ఎన్డీఏ వర్సెస్ మహా**

బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీఏ, మహాఘఠ్‌బంధన్ మధ్య హోరాహోరీ పోరు తప్పదని సర్వే ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి. సెప్టెంబర్‌లో నిర్వహించిన స్టేట్ వైబ్ సర్వే ప్రకారం.. మహాఘఠ్‌బంధన్ కూటమికి 34.9 శాతం, ఎన్డీఏ 34.8 శాతం ఓట్లు వచ్చే అవకాశం ఉంది. నిరుద్యోగం, వలసలు గురించి బిహార్ ప్రజలు ఎక్కువగా ఆందోళన చెందుతున్నారని సర్వే వెల్లడించింది. ముస్లింలలో మూడింట ఒకవంతు (38.4%) ఓటు చోరీపై ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల జాబితాల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కు వ్యతిరేకంగా కాంగ్రెస్ ముఖ్యనేత రాహుల్ గాంధీ చేసిన ప్రచారం ఓటర్లపై కొంతమేర ప్రభావం చూపించినట్టుగా కనబడుతోంది. తేజస్వీ యాత్రతో జోష్ తేజస్వీ చేపట్టిన యాత్రతో ఆర్జేడీ కార్యకర్తలను ఉత్తేజపరిచిందని 43.8 శాతం మంది అభిప్రాయపడ్డారు. యాదవుల నుంచి మంచి స్పందన వస్తోందని 76.7 శాతం మంది సర్వేలో పేర్కొన్నారు. లాలూ ప్రసాద్ యాదవ్ కుటుంబంలోని అంతర్గత వివాదాలు ఎన్నికల ఫలితాలపై ఎటువంటి ప్రభావం చూపబోవని 45.8 శాతం మంది అభిప్రాయపడ్డారు. ఎవరికి ఓటు వేయాలో ఇప్పటికే నిర్ణయించుకున్నామని 56.3 శాతం మంది సర్వేలో చెప్పారు. ఇంకా నిర్ణయం తీసుకోలేదని 43.7% మంది తెలిపారు.

# సీఎం రేవంత్‌ను కలిసిన ఖానాపూర్ ఎమ్మెల్యే

## వెడ్మ బొజ్జు వినతితో నిధులు మంజూరు

## 7న జోడేఘాట్ రావాలని ఆహ్వానం

**హైదరాబాద్, మహా :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు బుదవారం హైదరాబాద్ లో కలసి వినతి పత్రాలు అందజేయగా, సీఎం సానుకూలంగా స్పందించడంతో పాటు ఖానాపూర్ కు వరాలిచ్చారు. కొమురం భీమ్ వర్ధంతి ఈ నెల 7న కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని కేరమేరి మండలం జోడేఘాట్ గ్రామంలో ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని సీఎంకు ఎమ్మెల్యే వివరించారు. ఆదివాసీ గిరిజన సంక్షేమం కోసం కొమరం భీమ్ చేసిన పోరాటం చరిత్రాత్మకమని.. అలాంటి మహనీయుని పోరాట పటిమ భవిష్యత్ తరాలకు ఆదర్శమని ఎమ్మెల్యే తెలిపారు. వర్ధంతి సమావేశాల కొరకు షెడ్ నిర్మాణం, జాతీయ రహదారిపై 6 కిమీ ల రోడ్ పై అనుమతుల కొరకు సంబంధిత అధికారులతో మాట్లాడి వెంటనే చర్యలు తీసుకోవాలని సీఎం అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్టు ఎమ్మెల్యే తెలిపారు. ఖానాపూర్ మున్సిపాలిటీ అభివృద్ధి కోసం 15 కోట్లు రూపాయలు, ఐటిడిఎ భవన నిర్మాణనికి 15 కోట్లు రూపాయలు నిధులు



మంజూరు చేసినందుకు సీఎంకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. వర్ధంతికి సీఎం రేవంత్ రెడ్డిని ముఖ్య అతిథిగా రావాలని ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ కార్యక్రమంలో కొమరం భీమ్ మనువడు కుంరం సోనేరావ్, జైనూరు మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాథ్, భీమ్ హుస్తవ కమిటీ చైర్మన్ కుంరం లాల్షావ్, మాజీ ఎంపీపీ మిధునం పాల్గొన్నారు.

# మద్యం లారీకి మంటలు

## బాటిళ్ల కోసం ఎగబడ్డ స్థానికులు.. రామంతపూర్ లో ఘటన

**హైదరాబాద్, మహా :** నగరంలో ఓ మద్యం లారీకి అగ్నిప్రమాదం సంభవించింది. హబ్సిగూడ ప్రాంతంలో బుధవారం ఈ ఘటన చోటుచేసుకుంది. సమాచారం ప్రకారం, మద్యం లోడుతో వెళ్తున్న లారీ ఒక్కసారిగా మంటలు అంటుకోవడంతో డ్రైవర్ వెంటనే అప్రమత్తమై వాహనాన్ని రోడ్డుపక్కన నిలిపేశాడు. ప్రాణాలను కాపాడుకునేందుకు వాహనం నుంచి కిందకు దూకి తప్పించుకున్నాడు. మంటలు చెలరేగడంతో లారీలో ఉన్న మద్యం బాటిళ్లు దెబ్బ తిన్నాయి. కొంత భాగం పూర్తిగా కాలిపోగా, మరి కొన్ని బాటిళ్లు అగ్నికి గురయ్యాయి. ఈ క్రమంలో అక్కడికక్కడే గుమికూడిన కొంతమంది స్థానికులు మంటల మధ్యే మద్యం బాటిళ్లను ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నించారు. ఈ నేపథ్యంలో కొంత మంది అందినకాడికి మద్యం సీసాలను తీసుకుని వెళ్ళిపోయారు. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చారు. అదృష్టవశాత్తూ ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. అయితే మద్యం సరకు భారీగా నష్టపోయినట్లు అంచనా వేస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

# దేశంలో అత్యంత సంపన్న మహిళగా రోష్ని నాడార్

## హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ ఛైర్‌పర్సన్ రోష్ని

## రూ. 2.84 లక్షల కోట్లుగా ఆస్తి విలువ అంచనా

**మహా:** హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ ఛైర్‌పర్సన్ రోష్ని నాడార్ మల్హోత్రా మరోసారి తన ప్రత్యేకతను చాటుకున్నారు. భారతదేశంలో అత్యంత సంపన్న మహిళగా అగ్రస్థానంలో నిలవడమే కాకుండా, దేశంలోని టాప్ 10 కుబేరుల జాబితాలో అతి పిన్న వయస్కురాలిగానూ రికార్డు సృష్టించారు. ప్రముఖ సంస్థ ఎం3ఎం హురున్ ఇండియా 2025 సంవత్సరానికి గాను విడుదల చేసిన సంపన్నుల జాబితాలో ఈ విషయం వెల్లడైంది. ఈ నివేదిక ప్రకారం, రోష్ని నాడార్ మల్హోత్రా సంపద విలువ ఏకంగా రూ. 2.84 లక్షల కోట్లుగా ఉన్నట్లు అంచనా వేశారు. దీంతో ఆమె భారత మహిళా పారిశ్రామికవేత్తల్లో మొదటి స్థానంలో నిలిచారు. దేశంలోని టాప్ 10 మంది అత్యంత ధనవంతుల జాబితాను పరిశీలిస్తే, అందులో అతి తక్కువ



వయసున్న వ్యక్తిగా రోష్ని నాడార్ నిలవడం గమనార్హం. టెక్నాలజీ రంగంలో తనదైన ముద్ర వేస్తూ ముందుకు సాగుతున్న ఆమె, దేశంలోని యువ పారిశ్రామికవేత్తలకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

# నువ్వసలు బీసీ బిడ్డవేనా?

## సర్పంచ్ ఎలక్షన్స్ ఆపిస్తవా?

- ఎంపీ ఈటల రాజేందర్‌పై ఎమ్మెల్సీ కవిత ఫైర్
- బీఆర్ఎస్ పార్టీతో నాకు ఎలాంటి సంబంధం లేదు



**హైదరాబాద్, మహా:** బతుకమ్మ వేడుకల్లో గిన్నిస్ రికార్డ్ కోసం విచిత్ర వింత పోకడలకు పోవడం దుర దృష్టకరమని.. మొదటి నుంచి తెలంగాణ సాంస్కృతిని కాపాడుకునేందుకు ఆరాటపడిన సంస్థ జాగృతి అని కల్వకుంట్ల కవిత అన్నారు. హైదరాబాద్‌లో మీడియా సమావేశంలో కీలక వ్యాఖ్యలు చేశారు. కేవలం పదివేల మందితో ప్రభుత్వం నిర్వహించిన బతుకమ్మ పండుగ మహిళలను అవమానించినట్లే ఉందని.. వచ్చే సంవత్సరం జాగృతి ఆధ్వర్యంలో లక్ష మందితో బతుకమ్మ సంబరాలు నిర్వహిస్తామని ప్రకటించారు. గిన్నిస్ రికార్డ్ తో ఇది మహిళల పండుగ అని నిరూపిస్తామన్నారు. ప్రభుత్వం మళ్లీ చేస్తే ఆ మరుసటి సంవత్సరం దాన్ని మించి చేస్తామన్నారు. బతుకమ్మ పండుగ సందర్భంగా చింతమడక నుంచి లండన్ వరకు పలు ప్రాంతాలు తిరిగానన్నారు. తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చి బతుకమ్మ లేకుండా చేశారని..తెలంగాణ ద్రోహి తెలంగాణ విగ్రహాన్ని ఏర్పాటు చేశారని మండిపడ్డారు. జై తెలంగాణ అనని సీఎం బతుకమ్మ నిమజ్జనంలో పాల్గొన్నారని విమర్శించారు. రికార్డ్ కోసం బతుకమ్మ చేశారు. ఎన్నో ఏళ్లుగా ప్రజలు ఈ పండుగను నిలబెట్టుకున్నారు. మేము ఎప్పుడు రికార్డుల కోసం పండుగ నిర్వహించ లేదన్నారు. ఉమ్మడి రాష్ట్రంలోనే కోటి బతుకమ్మలా జాతర చేశామని.. బొడ్డెమ్మ ల నుంచి కోటి బతుకమ్మల వరకు 28 రోజుల పాటు చేశాం. రికార్డుల కోసం కాదన్నారు. తెలంగాణ సాధన కోసం మాత్రమే చేశామని గుర్తు చేశారు.

**కేసులు వేసిన వారు రేవంత్ రెడ్డి దగ్గర వ్యక్తులే..**

ఈ ప్రభుత్వం కూడా ఆ విధంగా నిర్వహించి... బతుకమ్మకు బతుకమ్మ చీరలు ఇచ్చి ఉంటే బాగుండేదని కవిత అన్నారు. మహిళలకు ఏదైనా మంచి జరిగేలా కార్యక్రమం చేయాల్సి ఉందని.. కానీ చేయలేదన్నారు. తెలంగాణ తల్లి బొమ్మ ఎవరు పెట్టారంటే తెలంగాణ ప్రజలు అని మాత్రమే రావాలి. రేవంత్ రెడ్డి అని రాకూడదన్నారు. రాజకీయపరమైన రిజర్వేషన్ బిల్లు మీద మాత్రం సమస్యలు వస్తున్నాయని, కేసులు వేసిన వ్యక్తులు రేవంత్ రెడ్డి దగ్గర వ్యక్తులని చాలా మంది చెబుతున్నారన్నారు. వీళ్లేమో ఇలా కేసులు వేస్తారు.. ఇక రాష్ట్రపతి వద్ద బిల్లును పాస్ చేయించాల్సిన బీజేపీ వాళ్లు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తారన్నారు. ఈటల రాజేందర్ ఎన్నికలకు వెళ్లవద్దు, డబ్బులు ఖర్చు పెట్టుకోవద్దు అని అంటారు. ఎన్నికల రిజల్ట్స్ వచ్చిన తర్వాత కూడా మేము క్యాన్సిల్ చేయిస్తామని అంటారు. ఈటల, బీజేపీ పార్టీ వాళ్లు కోర్టులా, జడ్జిలా అని ప్రశ్నించారు. మీ అధ్యక్షుడు జీవోను స్వాగతిస్తున్నా అంటాడు. ఈటల మాత్రం వేరేగా మాట్లాడుతారు. అసలు ఒక ఉద్యమకారుడిగా పేరున్న ఈటల ఇలా మాట్లాడవచ్చా? బీసీ బిడ్డ అయిన మీరు అలా మాట్లాడతారా తక్షణమే మీరు క్లారిఫికేషన్ ఇవ్వాలన్నారు. ఇక్కడున్న ఎనిమిది మంది ఎంపీలు వెళ్లి మోడీ కాళ్లు పట్టుకోని రిజర్వేషన్లు తెప్పించాలని సూచించారు. గ్రామ పంచాయితీల వారీగా మీ కులగణనను బయట పెట్టండి అని మేము డిమాండ్ చేస్తున్నామని.. ఇవ్వాళ బీజేపీ మీద బాధ్యత ఉంది. బీసీ బిల్లు పాస్ చేస్తారో లేదో చెప్పాలన్నారు. బీసీ లకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు వస్తే...ఆ తర్వాత చట్టసభల్లో రిజర్వేషన్ల కోసం పోరాడుతాం. రెండేళ్ల పాటు కాళేశ్వరం రిపేర్ చేయకుండా రైతులకు నీళ్లు ఇవ్వకుండా ప్రభుత్వం ఎండబెట్టింది. ఆ ఉసురు ఊరుకే పోదు. కచ్చితంగా కాంగ్రెస్ కు తగులుతుందని హెచ్చరించారు.

# రాష్ట్రంలో పెరిగిన నేరాలు

## ఎన్ సీఆర్ బీ నివేదిక వెల్లడి.. ఫోర్జరీ, చీటింగ్ కేసులలో హైదరాబాద్ టాప్

**హైదరాబాద్, మహా :** రాష్ట్రంలో నేరాల సంఖ్య గణనీయంగా పెరిగింది. హత్యలు, అత్యాచారాలు మాత్రమే కాదు. రోడ్డు ప్రమాదాలు, ఫోర్జరీ మోసాలు సైతం పెద్ద మొత్తంలో పెరిగినట్లు నేషనల్ క్రైమ్ రికార్డ్ బ్యూరో (ఎన్ సీఆర్ బీ) తన నివేదికలో వెల్లడించింది. దేశంలోని 16 ప్రధాన నగరాలతో పోలిస్తే రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో ఫోర్జరీ, ఛీటింగ్ కేసులు ఎక్కువ సంఖ్యలో నమోదు అయ్యాయి. హైదరాబాద్ లో ఫోర్జరీ, ఛీటింగ్ కేసులు 4,090 నమోదు కాగా, సుమారు 4,203 మంది బాధితులు ఈ కేసుల్లో మోసపోయినట్లు ఎఫ్ఐఆర్ లు తెలుపుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 202123లో 1,83,644 క్రిమినల్ కేసులు నమోదైనట్లు రికార్డులు వెల్లడిస్తున్నాయి. ఈ మేరకు దేశవ్యాప్తంగా జరిగిన నేరాల వార్షిక నివేదిక వివరాలను నేషనల్ క్రైమ్ రికార్డ్ బ్యూరో తన 71వ ఎడిషన్ లో వెల్లడించింది. దేశవ్యాప్తంగా చోటుచేసుకున్న నేరాల వివరాలను ఎన్‌సీఆర్‌బీ తన అధికారిక వెబ్ సైట్ లో అందుబాటులో ఉంచింది.

**అతి వేగంతో సంబవించిన మరణాలు 88.7 శాతం**

కేవలం నేరాలు మాత్రమే కాక 2023లో రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలు కూడా గణనీయంగా పెరిగాయి. రాష్ట్రంలో అత్యధికంగా 7,760 రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకోగా వాటిలో అత్యధికంగా 88.7శాతం మంది అతివేగంతోనే చనిపోయారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి లక్షమందిలో 35మంది కంటే ఎక్కువ మంది ప్రమాదాల్లో చనిపోయినట్లు రికార్డులు చెబుతున్నాయి. 2022లో జరిగిన ప్రమాదాలు 7,559లు కాగా 23లో 7,760 ప్రమాదాలతో రోడ్డు ప్రమాద మరణాలు 1.33 శాతం పెరిగాయి. దేశవ్యాప్తంగా 4,50,026 ప్రమాదాలు చోటు చేసుకోగా, ఈ ప్రమాదాల్లో రాష్ట్రంలో దాదాపు 5 శాతం రోడ్డు ప్రమాదాలు సంభవించినట్లు నివేదిక వెల్లడించింది.

**మహిళ కేసుల్లో 6 శాతం పెరుగుదల**

2022 ఏడాదితో పోలిస్తే 2023లో తెలంగాణలో మహిళలపై నేరాలు ఆరు శాతం పెరిగినట్లు నివేదిక వెల్లడించింది. రాష్ట్రంలో రికార్డు స్థాయిలో మహిళలపై 23,679 నేరాలు నమోదయ్యాయి. 2022లో 22,065 కేసులు నమోదు కాగా, ఈ ఏడాది మరో ఆరు శాతం కేసులు పెరిగాయి. అందులో ఆత్మహత్యకు ప్రేరేపించిన ఘటనలపై అధిక కేసులు నమోదు అయ్యాయి. మూడేళ్ల కాలంలో రాష్ట్రంలో క్రైమ్ రేట్ విపరీతంగా పెరిగినట్లు నివేదిక స్పష్టం చేసింది. 2021-23 మధ్యకాలంలో 25వేల కేసులు అత్యధికంగా నమోదయ్యాయి. వాటిలో హింసాత్మక నేరాలు, సైబర్ నేరాలు, ఆర్థిక నేరాల తదితర కేసులు ఉన్నాయి. ఇక అట్రాసిటీ కేసుల విషయంలో కొంత తగ్గుముఖం పట్టాయి. అదే సమయంలో సైబర్ నేరాలు బాగా పెరిగాయి. సుమారు 8వేల సైబర్ కేసులు అధికంగా నమోదయ్యాయి. ఆర్థిక నేరాలకు సంబంధించి ఆరు వేలకు పైగా కేసులు రికార్డయ్యాయి. అట్రాసిటీ కేసులు స్వల్పంగా తగ్గాయి. కానీ వాటిలో షెడ్యూల్ ట్రైబల్ అట్రాసిటీ పెరిగినట్లు నివేదిక తేల్చి చెప్పింది.

# గోధుమలకు మద్దతు ధర రూ.160కు పెంపు



- 57 కేంద్రీయ విద్యాలయాల ఏర్పాటుకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్
- 3 శాతం డీఏ పెంచుతూ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు గుడ్ న్యూస్
- అంటే రూ. 60 వేల బేసిక్ జీతం ఉన్న ఉద్యోగికి అదనంగా 34,800 రూపాయలు

**ఢిల్లీ, మహా:** కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు 3 శాతం డీఏ పెంపునకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. బుధవారం నాడు కేంద్ర కేబినెట్ సమావేశం ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఉద్యోగులకు డీఏ పెంపు వల్ల కేంద్ర ప్రభుత్వంపై ప్రతి ఏటా రూ. 10,084కోట్ల భారం పడనుంది. పెంచిన డీఏను ఈ ఏడాది జూలై నుంచి అమలు చేయనున్నారు. ఈ ఏడాది మార్చిలో రెండు శాతం డీఏ పెంచారు. దీంతో డీఏ 53 నుంచి 55 శాతానికి చేరింది. తాజాగా 3 శాతం పెంచారు. అంటే రూ. 60 వేల బేసిక్ జీతం ఉన్న ఉద్యోగికి అదనంగా రూ.34,800 డీఏ లభించనుంది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల ఫిట్ మెంట్ 1.83 నుంచి 2.86 మధ్య ఉంటుందని అంచనా వేస్తున్నారు. అంటే దాదాపు 13 నుంచి 34 శాతం పెంపుదల ఉండవచ్చని చెబుతున్నారు. అలాగే 57 కేంద్రీయ విద్యాలయాల ఏర్పాటుకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందుకోసం రూ. 5863 కోట్లను ఖర్చు చేయనున్నారు. రూ.11,440 కోట్లతో పప్పుధాన్యాల స్వయం వృద్ధికి కేబినెట్ అనుమతిని ఇచ్చింది. మరోవైపు గోధుమలకు మద్దతు ధర పెంచాలని నిర్ణయం తీసుకుంది. క్వింటా గోధుమలకు మద్దతు ధరను రూ. 160కు పెంచారు. దీంతో గోధుమ క్వింటా ధర రూ. 2,585కు చేరింది.

## రాజమండ్రి – తిరుపతి మధ్య విమాన సర్వీసు ప్రారంభం

- వర్చువల్ గా ప్రారంభించిన కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడు
- రాజమండ్రి ఎంపీ దగ్గుపాటి పురందేశ్వరి
- మాధురపూడి లో జెండా ఊపి సర్వీస్ ప్రారంభించిన మంత్రి కందుల దుర్గేష్

**రాజమండ్రి, మహా :** రాజమండ్రి తిరుపతి మధ్య నూతన విమాన సర్వీసును ఢిల్లీ నుంచి కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడు , రాజమండ్రి పార్లమెంట్ సభ్యురాలు దగ్గుపాటి పురందేశ్వరిలు బుధవారం వర్చువల్ గా ప్రారంభించారు. అలయన్స్ ఎయిర్ సంస్థ ఆధ్వర్యంలో వారానికి మూడు రోజులు(మంగళ,గురు,శని వారాలు) రాజమండ్రి నుండి తిరుపతి మధ్య ఈ విమాన సర్వీసులు నడవనున్నాయనీ తెలిపారు. ఉదయం 7:40 గంటలకు తిరుపతిలో బయలుదేరి 9.25 గంటలకు రాజమండ్రి చేరుకుని.. ఉదయం 9.50 గంటలకు రాజమండ్రి లో బయలు దేరి ఉదయం 11.20 గంటలకు తిరుపతి చేరుకుంటుంది.ఈ విమాన సర్వీసు ప్రారంభంతో రాజమండ్రి తిరుపతి మధ్య ప్రయాణ సమయం గణనీయంగా తగ్గనుంది. ఢిల్లీ నుంచి వర్చువల్ గా ప్రారంభించిన ఈ కార్యక్రమంలో రాజమండ్రి ఎయిర్ పోర్ట్ నుంచి రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, రాజమండ్రి రూరల్ అర్బన్, రాజానగరం ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ఆదిరెడ్డి శ్రీనివాస్, బత్తుల బలరామకృష్ణ, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

# వడ్డీ రేట్లపై ఆర్బీఐ కీలక నిర్ణయం

## యథాతథంగా రేపో రేటు

- తటస్థ ద్రవ్య విధాన వైఖరికే కట్టుబడిన ద్రవ్య విధాన కమిటీ
- దేశ జీడీపీ వృద్ధి అంచనా 6.8 శాతానికి పెంపు
- ద్రవ్యోల్బణం అంచనాను 2.6 శాతానికి తగ్గించిన రిజర్వ్ బ్యాంక్
- గతంలో తగ్గించిన వడ్డీ రేట్ల ప్రభావం కోసం వేచి చూస్తున్నామన్న గవర్నర్

**న్యూఢిల్లీ, మహా :** సామాన్యులు, రుణ గ్రహీతలు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ద్రవ్య విధాన సమీక్షలో భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్బీఐ) కీలక నిర్ణయం తీసుకుంది. కీలకమైన రెపో రేటును ప్రస్తుతం ఉన్న 5.5 శాతంగానే యథాతథంగా కొనసాగిస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా బుధవారం ద్రవ్య విధాన కమిటీ (ఎంపీసీ) నిర్ణయాలను వెల్లడించారు. దీంతో ఇప్పట్లో గృహ, వాహన, ఇతర రుణాలపై వడ్డీ రేట్లు (ఈఎంఐలు) తగ్గే అవకాశం కనిపించడం లేదు. ద్రవ్య విధానంపై తటస్థ వైఖరినే కొనసాగించాలని కమిటీ నిర్ణయించినట్లు సంజయ్ మల్హోత్రా తెలిపారు. ఆర్థిక వ్యవస్థకు ఊతమివ్వడం, అదే సమయంలో ద్రవ్యోల్బణాన్ని అదుపులో ఉంచడం మధ్య సమతుల్యత సాధించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన స్పష్టం చేశారు. "గతంలో తీసుకున్న విధానపరమైన నిర్ణయాల పూర్తి ప్రభావం స్పష్టంగా కనిపించే వరకు వేచి చూడటం సమంజసమని భావిస్తున్నాము" అని ఆయన వివరించారు. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి ఇప్పటికే 100 బేసిస్ పాయింట్ల మేర రెపో రేటును తగ్గించామని, ఆ ప్రయోజనాలు ఇంకా ఆర్థిక వ్యవస్థకు పూర్తిగా అందాల్సి ఉందని ఆయన గుర్తుచేశారు. మరోవైపు, దేశ ఆర్థిక భవిష్యత్తుపై ఆర్బీఐ సానుకూల అంచనాలను ప్రకటించింది. ఆహార పదార్థాల ధరలు గణనీయంగా తగ్గడం, జీఎస్టీ రేట్ల కోత వంటి కారణాలతో ద్రవ్యోల్బణం మరింత అదుపులోకి వచ్చిందని గవర్నర్ తెలిపారు. ఈ నేపథ్యంలో, 202526 ఆర్థిక సంవత్సరానికి ద్రవ్యోల్బణం సగటు అంచనాను గతంలోని 3.1 శాతం నుంచి 2.6 శాతానికి తగ్గిస్తున్నట్లు వెల్లడించారు. అదే విధంగా, దేశ స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ) వృద్ధి రేటు అంచనాను కూడా ఆర్బీఐ పెంచింది. దేశీయంగా బలమైన గిరాకీ, అనుకూలమైన రుతుపవనాలు, ద్రవ్య విధాన సరళీకరణ వంటి అంశాల నేపథ్యంలో వృద్ధి అంచనాను 6.5 శాతం నుంచి 6.8 శాతానికి పెంచుతున్నట్లు సంజయ్ మల్హోత్రా పేర్కొన్నారు. ప్రస్తుతం వాణిజ్యపరమైన అంశాలలో చోటుచేసుకుంటున్న పరిణామాలను కూడా నిశితంగా గమనిస్తున్నామని, అందుకే వడ్డీ రేట్ల విషయంలో వేచి చూసే ధోరణిని అవలంబిస్తున్నామని ఆయన తెలిపారు.

## చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక విజయ దశమి

- ప్రజలందరికీ విజయ దశమి దసరా శుభాకాంక్షలు
- మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి

**హైదరాబాద్, మహా :** విజయదశమి పురస్కరించుకుని సచివాలయంలోని తన ఛాంబర్ లో రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రోడ్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి,సెట్విన్ చైర్మన్ గిరిధర్ రెడ్డి, ఆర్ అండ్ బి శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, ఫిల్మ్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ ఎండీ సీహెచ్ ప్రియాంక, ఆర్ అండ్ బి ఈ ఎన్సీలు మోహన్ నాయక్, జయ భారతి, సీఈలు రాజేశ్వర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, బి.వి రావు, లింగారెడ్డి, కిషన్ రావు పలువురు సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. "విజయ దశమి శుభ సందర్భంగా ఆర్ అండ్ బి, సినిమాటోగ్రఫీ శాఖల అధికారులు,ఉద్యోగులు,తెలంగాణ ప్రజలందరికీ నా హృదయపూర్వక శుభాకాంక్షలు. చెడుపై..మంచి సాధించిన విజయానికి ప్రతీకగా ఈ పర్వదినాన్ని జరుపుకుంటాం. ప్రజా ప్రభుత్వంలో ఆ దుర్గామాత ఆశీర్వాదాలతో ప్రతి ఇంట్లో సుఖశాంతులు, ఐశ్వర్యం నెలకొనాలని,ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని అమ్మ వారిని ప్రార్థిస్తున్నాను." అని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. అంతకు ముందు మినిస్టర్స్ క్వార్టర్స్ లోని తన క్యాంపు కార్యాలయంలో వాహన, ఆయుధ పూజ నిర్వహించారు.



## సీఎంను కలిసిన డీజీపీ

రాష్ట్ర నూతన డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ గా నియమితులైన నేపథ్యంలో బి. శివధర్ రెడ్డి సీఎం రేవంత్ రెడ్డి ని బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎం ఆయనకు అభినందనలు తెలియజేశారు.

## పనిమనిషి ఫిర్యాదు

### హీరోయిన్ డింపుల్ హయతీపై కేసు నమోదు చేసిన ఫిలింనగర్ పోలీసులు

**హైదరాబాద్, మహా :** టాలీవుడ్ హీరోయిన్ డింపుల్ హయతీ పై ఫిలిం నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పనిమనిషి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. జీతం విషయంలో పని మనిషిపై డింపుల్ హయతి దూషించినట్లు సమాచారం. 'నా చెప్పుల విలువ కాదు.. నీ బ్రతుకు' అంటూ దూషించడంతో పాటు దాడికి పాల్పడినట్లు పని మనిషి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. పని పనిమనిషి ఫిర్యాదుతో హీరోయిన్ డింపుల్ హయతీ తో పాటు ఆమె భర్త విక్టర్ డేవిడ్ మీద కూడా క్రిమినల్ కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. షేక్‌పేటలోని వెస్ట్ వుడ్ అపార్ట్‌మెంట్లో భర్త డేవిడ్‌తో కలిసి డింపుల్ హయాతి నివాసం ఉంటున్నారు. ఆమె ఇంట్లో కుక్కలను చూసుకోవడానికి ఒడిషాకు చెందిన ఇద్దరు అమ్మాయిలను ఈనెల 22న ఓ ఏజెన్సీ ద్వారా నియమించుకున్నారు. పనిలో చేరిన రోజు నుంచే డింపుల్ హయాతి భర్త పని మనుషుల పట్ల దురుసుగా ప్రవర్తించడంతో పాటు 'నా చెప్పులకు ఉన్న విలువ మీ జీవితాలకు లేదు' అంటూ దుర్భాషలాడినట్లు ఆరోపిస్తున్నారు. డింపుల్ హయాతి సైతం తమను దుర్భాషలాడారని, తమ తల్లి దండ్రులను చంపేస్తామని బెదిరించారని బాధితులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

# ఇంకో వారం వానలు

## తెలంగాణకు ఎల్లో అలర్ట్ జారీ

- ముగిసిన నైరుతి రుతుపవనాల సీజన్
- ఇప్పటికే 33 శాతం అధిక వర్షపాతం
- అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు ఈశాన్య రుతుపవనాలు
- 112% అధికంగా వర్షా లు కురిసే చాన్స్

**హైదరాబాద్, మహా :** రాష్ట్రంలో వారం రోజుల పాటు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. మధ్య బంగాళాఖాతంలో బుధవారం అల్పపీడనం ఏర్పడే చాన్స్ ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. అది గురువారం నాటికి వాయుగుండంగా బలపడి పశ్చిమ మధ్య బంగాళాఖాతం వరకు విస్తరించే అవకాశం ఉందని పేర్కొంది. దాని ప్రభావంతో రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. రాష్ట్రం మొత్తానికి ఎల్లో అలర్ట్ జారీ చేసింది.

**ముగిసిన వర్షా కాలం**

ఇక నైరుతి రుతుపవనాల కాలం మంగళవారంతో పూర్తయింది. ఈ సీజన్‌లో రాష్ట్రంలో సాధారణం కన్నా అధిక వర్షపాతం నమోదైంది. నైరుతి రుతుపవనాల కాలంలో జూన్ నుంచి సెప్టెంబర్ వరకు సగటు వర్షపాతం 74.07 సెంటీమీటర్లు కాగా.. 98.83 సెంటీమీటర్ల వర్షపాతం రికార్డయింది. ఇది సాధారణం కన్నా 33 శాతం ఎక్కువ. 12 జిల్లాల్లో వంద సెంటీ మీటర్లకుపైగా సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా ములుగు జిల్లాలో 145.74 సెంటీమీటర్లు, ఆదిలాబాద్‌లో 136.34, కామారెడ్డిలో 132.87, కుమ్రంభీం ఆసిఫాబాద్‌లో 131.25, మెదక్‌లో 130.15, భద్రాద్రి కొత్తగూడెంలో 115.84, నిర్మల్‌లో 115.7, వరంగల్‌లో 110.24, సిద్దిపేటలో 106.36, జయశంకర్ భూపాలపల్లిలో 105.81, మంచిర్యాలలో 104.33, నిజామాబాద్‌లో 103.03 సెంటీమీటర్ల చొప్పున వర్షపాతం రికార్డయింది. మొత్తంగా 7 జిల్లాల్లో సాధారణం కన్నా 60 శాతం ఎక్కువ, 16 జిల్లాల్లో సాధారణం కన్నా 20 నుంచి 59 శాతం అధికం, పది జిల్లాల్లో సాధారణ వర్షపాతం రికార్డయింది. మరోవైపు అన్ని మండలాల్లోనూ ఈసారి మంచి వర్షాలే పడ్డాయి. కేవలం మూడు మండలాల్లోనే లోటు వర్షపాతం నమోదైంది. 621 మండలాల్లోని 137 మండలాల్లో సాధారణం కన్న ఎక్కువ, 294 మండలాల్లో సాధారణ వర్షపాతం, 187 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది.

**ఒక్క జూన్‌లోనే లోటు**

నైరుతి రుతుపవనాల కాలంలో కేవలం ఒక్క జూన్‌లోనే లోటు వర్షపాతం నమోదైంది. వాస్తవానికి ఈ ఏడాది మే 26నే రాష్ట్రంలోకి నైరుతి రుతుపవనాలు ఎంటరైనా అల్పపీడనాలు ఏర్పడక పోవడం, గాలుల ప్రభావంతో జూన్‌లో సరైన వర్షాలు పడలేదు. 13.03 సెంటీమీటర్ల వర్షపాతం నమోదవ్వాల్సి ఉన్నా 20 శాతం లోటు ఏర్పడింది. జులై మూడో వారం వరకు ఇవే పరిస్థితులు కొనసాగినా అడపాదడపా కురిసిన భారీ వర్షాలతో సాధారణ వర్షపాతం నమోదైంది. ఆగస్టులో మాత్రం నెల ప్రారంభం నుంచే మెరుగైన వర్షాలు కురిశాయి. 21.58 సెంటీమీటర్ల సాధారణ వర్షపాతానికి గాను.. 37.85 సెంటీమీటర్లు రికార్డయింది. ఇది సాధారణం కన్నా 75 శాతం అధికం. ఇక సెప్టెంబర్‌లోనూ 60 శాతం అధిక వర్షపాతం నమోదైంది. ఈ నెలలో 16.72 సెంటీమీటర్ల సాధారణ వర్షపాతానికి గాను 26.77 సెంటీమీటర్ల వర్షపాతం రికార్డయింది.


**ఇక ఈశాన్యం వంతు**

అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు ఈశాన్య రుతు పవనాలతో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. దీనికి సంబంధించి లాంగ్ రేంజ్ ఫోర్ కాస్ట్‌ను విడుదల చేసింది. తెలంగాణతో పాటు దేశవ్యాప్తంగా సాధారణం కన్నా అధిక వర్షాలు కురుస్తాయని ఐఎండీ తెలిపింది.

## పాకిస్థాన్‌పై ఆపరేషన్ ఎందుకు ఆపారు?

### కేంద్రాన్ని ప్రశ్నించిన ఎంఐఎం నేత ఒవైసీ

**న్యూఢిల్లీ, మహా :** పహల్గాం ఉగ్రదాడి తర్వాత పాకిస్థాన్‌పై భారత్ ప్రారంభించిన సైనిక చర్యలను మధ్యలోనే ఎందుకు నిలిపివేశారని ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ కేంద్ర ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. దేశమంతా ఒక్కతాటిపై నిలిచి, గట్టి సమాధానం చెప్పడానికి సిద్ధంగా ఉన్న సమయంలో ఆపరేషన్‌ను ఆపివేయడం వెనుక కారణమేంటని ఆయన నిలదీశారు. పహల్గాం దాడి జరిగినప్పుడు మీరే ప్రధాని అయితే ఏం చేసేవారని ఓ విలేకరి ప్రశ్నించగా, ఒవైసీ ఆ ప్రశ్నను సున్నితంగా పక్కనపెట్టారు. "సోదరా, అలాంటి కలలు కనే అలవాటు నాకు లేదు. నేను వాస్తవంలో ఉంటాను. మా లక్ష్యం కేవలం పదవులు చేపట్టడం కాదు" అని ఆయన స్పష్టం చేశారు. అనంతరం ఆయన అసలు విషయానికి వస్తూ, పహల్గాం ఘటన తర్వాత పాకిస్థాన్‌కు గట్టి బుద్ధి చెప్పేందుకు భారత్‌కు ఒక మంచి అవకాశం లభించిందన్నారు. "అదొక యుద్ధం లాంటి పరిస్థితి. అలాంటి సమయంలో ఆపరేషన్ ఎందుకు ఆగిపోయిందో నాకు నిజంగా అర్థం కావడం లేదు. దేశం మొత్తం గట్టి సమాధానం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నప్పుడు ఎందుకు వెనక్కి



తగ్గారు? ఇప్పుడు పార్లమెంటులో కూర్చుని పీవోకేను స్వాధీనం చేసుకుంటామని మాట్లాడతారు" అంటూ ఆయన కేంద్రంపై విమర్శలు గుప్పించారు. ఈ ఏడాది ఏప్రిల్ 22న "మినీ స్విట్జర్లాండ్"గా పిలిచే పహల్గాంలోని బైసరన్ లోయలో పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో ఒక నేపాల్ జాతీయుడితో సహా 26 మంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఈ దాడికి ప్రతీకారంగా భారత్ "ఆపరేషన్ సిందూర్" చేపట్టింది. పాకిస్థాన్, పీవోకేలోని 9 ఉగ్ర శిబిరాలను ధ్వంసం చేసింది. సింధు జలాల ఒప్పందాన్ని నిరవధికంగా నిలిపివేయడంతో పాటు పాక్ జాతీయులను వెనక్కి పంపింది.





## మన శంకరవరప్రసాద్ గారు శశిరేఖ అందాన్ని చూశారా?

మెగాస్టార్ చిరంజీవి కొణిదెల హీరోగా నటిస్తున్న లేటెస్ట్ మూవీ మన శంకరవరప్రసాద్‌గారు. సక్సెస్‌ఫుల్ డైరెక్టర్ అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీలో నయనతార కథానాయికగా నటిస్తోంది. ఈ మధ్యే చిరు-నయనతార కాంబినేషన్‌లో ఓ సాంగ్ షూటింగ్ కూడా పూర్తయింది. తాజాగా ఈ మూవీ నుంచి నయనతార ఫస్ట్‌లుక్ రిలీజ్ చేశారు. ఆమె పాత్ర పేరును శశిరేఖగా పరిచయం చేశారు.

### దసరాకు సర్‌ప్రైజ్

పసుపురంగు చీరలో, కొప్పున పూలెట్టుకుని, చేతిలో ఓ గొడుగు పట్టుకుని ముసిముసి నవ్వులు నవ్వుతోంది నయన్. రేపు (అక్టోబర్ 2న) దసరా కానుకగా ఓ సర్‌ప్రైజ్ ఉంటుందన్నారు. అంటే మూవీ నుంచి ఏదైనా గ్లింప్స్ విడుదల చేసే అవకాశం ఉండొచ్చన్నమాట! ఇక ఈ చిత్రాన్ని అర్చన సమర్పణలో సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మిస్తున్నారు. ఈ చిత్రం 2026 సంక్రాంతికి విడుదలవుతోంది.



## జ్ఞాపకాలను మోయడం ఆపేశాను

“నా ఇరవయ్యేళ్ల వయసులో విశ్రాంతి లేకుండా గందరగోళంలో గడిపాను... గుర్తింపు కోసం ఆరాటపడ్డాను. నా ఫీలింగ్స్ ఏవీ పైకి కనిపించకుండా ఉండేందుకు కష్టపడ్డాను. ఈ క్రమంలో నన్ను నేను ఎంత కోల్పోయానో నాకు మాత్రమే తెలుసు. ఆ సమయంలో ప్రేమ గురించి నాకెవరూ చెప్పలేదు. కానీ నిజమైన ప్రేమ మనలోనే దాగి ఉంటుందని, మనల్ని మనం ప్రేమించుకోవడమే నిజమైన ప్రేమ అని ఆ తర్వాత అర్థం చేసుకున్నాను” అని పేర్కొన్నారు సమంత. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ తన ఆలోచనలను, అభిప్రాయాలను ఎప్పటికప్పుడు తన ఫ్యాన్స్‌తో షేర్ చేసుకుంటుంటారు సమంత. తన మేకప్‌మేన్‌తో ఓ సుదీర్ఘమైన చర్చ జరగిందని, ఈ చర్చలో ఎన్నో అంశాలను మాట్లాడుకున్నామని పేర్కొని, వాటిలోని కొన్ని అంశాలను ప్రస్తావిస్తూ, ఇన్‌స్టాలో ఓ పోస్ట్ షేర్ చేశారు సమంత. “ముప్పైఏళ్ల తర్వాత మీరు ప్రపంచాన్ని చూసే తీరు మారిపోతుంది. మీ అందంలో మార్పులొస్తాయి. ఇప్పుడు నేను ముప్పై ఏళ్లలో ఉన్నాను. ప్రతిదాని వెంట పరుగులు పెట్టడం ఆపేసి, జీవితాన్ని ఆస్వాదిస్తున్నాను. గతంలో నేను చేసిన తప్పుల తాలూకు జ్ఞాపకాలను మోయడం ఆపేశా. పబ్లిక్‌లో ఒకలా... ఒంటరిగా ఉన్నప్పుడు మరోలా... ఇలా రెండు రకాలుగా ఉండటం మానేశాను. ఎందుకంటే మీరు మీలా ఉన్నప్పుడే హ్యాపీగా... స్వేచ్ఛగా జీవించగలరు” అని ఆపోస్ట్‌లో పేర్కొన్నారు సమంత.



## కల్కి, స్పిరిట్ గురించేనా?

తానెన్నడూ భయపడిందే లేదంటోంది స్టార్ హీరోయిన్ దీపికా పదుకొణె (Deepika Padukone). కష్టతరమైన మార్గంలోనూ దర్జాగా నడిచానని, ప్రశ్నించేందుకు ఎప్పుడూ వెనకడుగు వేయలేదని పేర్కొంది. ప్రముఖ ఎంటర్‌టైన్‌మెంట్ పోర్టల్ ఐఎమ్‌డీబీ (IMDB) 25 ఏళ్ల భారతీయ సినిమా (2000 2025) అంటూ 130 అత్యుత్తమ చిత్రాల జాబితాను రిలీజ్ చేసింది. అందులో 10 చిత్రాల్లో దీపికా పదుకొణె హీరోయిన్‌గా నటించడం విశేషం.

**కష్టాలదారిలోనే నడిచా..**

ఈ అరుదైన ఘనత అందుకోవడంపై దీపిక సంతోషం వ్యక్తం చేసింది. అలాగే రెండు పెద్ద సినిమాలైన స్పిరిట్, కల్కి 2లు చేజారడంపైనా పరోక్షంగా కామెంట్లు చేసింది. ఈ మేరకు తన జర్నీ గురించి దీపిక మాట్లాడుతూ.. నటిగా ప్రయాణం ప్రారంభించిన కొత్తలో నేనెలా ఉండాలి? ఏం చేస్తే సక్సెస్ అవుతానని నాకు సలహాలు, సూచనలు ఇస్తూ ఉండేవారు. అయితే కెరీర్ ప్రారంభం నుంచే నేను ముక్కుసూటిగా ఉన్నాను. ఏదైనా తప్పనిపిస్తే ప్రశ్నించేందుకు వెనకడుగు వేయలేదు. కష్టాలదారిలోనే కొనసాగాను, నాకెదురైన పరిస్థితులను సవాల్ చేస్తూ ముందడుగు వేశాను తప్ప ఎక్కడా తలవంచలేదు.

**నా తర్వాత వచ్చేవారికోసం..**


నా కుటుంబసభ్యులు, అభిమానులు నాపై ఉంచిన నమ్మకమే నేను తీసుకునే బలమైన నిర్ణయాలకు కారణం. నా తర్వాత వచ్చేవారు అనుసరించే మార్గాన్ని నేను శాశ్వతంగా మారుస్తానని ఆశిస్తున్నాను అని చెప్పుకొచ్చింది. బహుశా 8 గంటల షిఫ్ట్ గురించే ఆమె పై వ్యాఖ్యలు చేసినట్లు తెలుస్తోంది. ఇకపోతే దీపికా ప్రస్తుతం షారూఖ్ ఖాన్‌తో కలిసి కింగ్ మూవీ చేస్తోంది. అలాగే అల్లు అర్జున్‌అట్లీ మూవీలోనూ యాక్ట్ చేస్తోంది.

## 11 ఏళ్ల బంధానికి స్వస్తి.. జీవీ ప్రకాశ్-సైంధవికి విడాకులు





ప్రముఖ సంగీత దర్శకుడు, హీరో జీవీ ప్రకాశ్ కుమార్, సింగర్ సైంధవికి విడాకులు మంజూరయ్యాయి. ఈమేరకు చెన్నై ఫ్యామిలీ కోర్టు మంగళవారం తీర్పునిచ్చింది. జీవీ ప్రకాశ్ తన స్కూల్ ఫ్రెండ్ సైంధవిని 2013లో పెళ్లి చేసుకున్నాడు. వీరికి 2020వ సంవత్సరంలో కూతురు అన్వి జన్మించింది. 11 ఏళ్లపాటు ఎంతో అన్యోన్యంగా ఉన్న ప్రకాశ్ దంపతులు గతేడాది విడిపోతున్నట్లు ప్రకటించారు. ఏకాభిప్రాయంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. విడిపోయిన తర్వాత కూడా వీరిద్దరూ మంచి స్నేహితులుగా కొనసాగారు. మలేషియాలో జరిగిన జీవీ ప్రకాశ్ సంగీత కచేరీలో సైంధవి పాట పాడారు. ఓపక్క స్నేహాన్ని కొనసాగిస్తూనే.. మరోవైపు విడాకుల కోసం వీరిద్దరూ ఫ్యామిలీ కోర్టును ఆశ్రయించారు. కూతురు అన్విని సైంధవి వద్దే ఉంచేందుకు తనకెలాంటి అభ్యంతరం లేదని జీవీ ప్రకాశ్ కోర్టుకు తెలిపాడు. దీంతో న్యాయస్థానం మంగళవారం నాడు ఈ జంటకు విడాకులు మంజూరు చేస్తూ తీర్పు వెలువరించింది.



## ఏపీలో కాంతార: చాప్టర్ 1 టికెట్ ధరలు పెంపు.. ఎంతంటే?

కన్నడ నటుడు రిషబ్ శెట్టి హీరోగా నటించిన ‘కాంతారా ఛాప్టర్ 1’ సినిమా టికెట్ ధరలు పెంపునకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. రాష్ట్రంలోని స్క్రీన్ థియేటర్లలో రూ.75, మల్టీప్లెక్స్ లలో రూ.100 పెంపునకు అనుమతి ఇస్తూ ఉతర్వ్యాలు జారీ చేసింది. దీంతో పాటు ప్రీమియర్స్‌కి కూడా అనుమతి ఇచ్చింది. అక్టోబర్ 1న రాత్రి 10 గంటలకు ప్రీమియర్స్ షో పడనుంది. దీనికి కూడా ఈ పెంపు వర్తిస్తుంది. అలాగే అక్టోబర్ 2 నుంచి 11 వరకు సింగిల్ స్క్రీన్లలో రూ. 75, మల్లిప్లెక్స్‌లలో రూ. 100 పెంచుకునే వెలుసుబాటుని కల్పించింది. కాంతార: చాప్టర్ 1 విషయానికొస్తే.. పాన్ ఇండియా బ్లాక్ బస్టర్ ‘కాంతార’ చిత్రానికి ప్రీక్వెల్ ఇది. ఈ చిత్రాన్ని రిషబ్ శెట్టి స్వయంగా దర్శకత్వం వహించి, నటించారు. ఇటీవల విడుదలైన థియేట్రికల్ ట్రైలర్ అన్ని భాషలలో హ్యూజ్ బజ్ క్రియేట్ అంచనాలను భారీగా పెంచింది. ప్రముఖ నిర్మాణ సంస్థ హోంబలే ఫిల్మ్స్ నిర్మించిన ఈ చిత్రం అక్టోబర్ 2న దసరాకు విడుదల కానుంది.

EDITOR, PRINTER,PUBLISHER AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, PRINTED AT 19-12-458, BAIRAGIPATTEDA, TIRUPATHI - 517501, A.P., REGD NO : APTEL/2014/58382. PH NO : 6300992296, Email : mahapatrika2003@gmail.com.
PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. Corporate Office : 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana, IN - 500034